మూలయ్య

ఎక్కడ కనిపించాడు నీకు?

పుట్టయ్య

కావేరిఒడ్డున కళ్లు మూసుకు కూర్చున్నాడు.

మూలయ్య

ఇంటికి తీసుకురాలేకపోయావా?

పుట్టయ్య

పలకరిస్తే పలకడు. కళ్లు మూసుకు అదే కూర్చోవడం. తిండి లేదు. నిద్ర లేదు.

మూలయ్య

మరేమి చేస్తూ ఉంటాడు అస్తమానం ఆగట్టున కూర్చుని?

పుట్టయ్య

ఏమి చేస్తూ ఉంటాడని చెప్పను? ఎప్పుడైనా కళ్లు తెరిచినప్పుడు 'రంగా' 'రంగా' అని ఒళ్లు తెలియని కేకలు వేసి గంతులు వేస్తూ ఉంటాడు.

మూలయ్య

బ్రాహ్మల్లో పుట్టవలసినవాడు మనలో తప్పి జారి పుట్టాడనుకొంటాను.

పుట్టయ్య

అన్నింటికన్న ఆశ్చర్యం ఏమిటో విన్నావా?

మూలయ్య

ఏమిటా ఆశ్చర్యం?

పుట్టయ్య

ఒంటినిండా దెబ్బలే. ఒళ్లంతా రాళ్ల దెబ్బలతో కదుములు కట్టింది. రక్తాలు కారుతూ ఉన్నా ఏమీ తెలియనట్లు ఎప్పుడూ "రంగా రంగా" అని అరుస్తూ ఉంటాడు.

మూలయ్య

రాళ్ల దెబ్బ లెందుకు తగిలినవి? కళ్లు మూసుకు కావేరిగట్టున కూర్చున్నవాడికి రాళ్ల దెబ్బల కర్మ మేమిటి?

పుట్టయ్య

నిన్న ఉదయం బ్రాహ్మలు ఏనుగుమీద బంగారుబిందె పెట్టి కావేరికి నీళ్లకోసం వచ్చారుట.

మూలయ్య

ఎందుకు?

పుట్టయ్య

బ్రాహ్మణవాడలో శ్రీరంగనాయకుల దేవాలయం లేదురా?

మూలయ్య

అవును, ఉంది, ఉంది. నీటిబరువుతో వంగిన మేఘములాగ దాని గోపురము ఆకాశంమీద కనిపించడం నేను దూరంనుంచి చూచాను.

పుట్టయ్య

శ్రీరంగనాయకులకు ప్రతీదినమూ కావేరీజలముతో మజ్జనం చేయిస్తారుట.

మూాలయ్య

అందుకా వస్త బ్రాహ్మలు?

పుట్టయ్య

అప్పుడు రేవుపక్క ఇసుకలో పాణయ్య కళ్లు మూసుకు కూర్చుని ఉన్నాడట.

మూాలయ్య

బ్రాహ్మలు వస్తే మరి లేచి దూరంగా వెళ్ల లేదూ?

పుట్టయ్య

ఎవరు వచ్చారో ఎవరు వెళ్లారో వాడి కేమైనా తెలిస్తేనా?

మూాలయ్య

ఏమి జరిగిం దప్పుడు?

పుట్టయ్య

బ్రాహ్మలు పాణయ్యను చూచి లెమ్మని కేకలు వేశారుట. ఎంత లెమ్మన్నా లేవక పోతే రాళ్లు విసిరారుట.

మూాలయ్య

బ్రాహ్మలకు అడ్డంగా కూర్చుంటే విసరరుమరీ?

పుట్టయ్య

అందులోనూ దేవకార్యం కోసం వచ్చిన బ్రాహ్మలాయెను!

మూాలయ్య

పాపం రాళ్లు తగిలేయి కాబోలు పాణయ్యకు?

పుట్టయ్య

చెప్పానుకాదూ, ఒళ్లు కదుములు కట్టిందని.

మూాలయ్య

చివరకి ఏమి జరిగినట్లు?

పుట్టయ్య

వాళ్లు విసిరినరాళ్ల దెబ్బలవల్లో, భక్త్యావేశము వల్లో పాణయ్య కొంతసేపటికి కళ్లు తెరిచి బ్రాహ్మలందరినీ చూచాడట. చూచి తటాలున లేచి, "రంగా, రంగా, ఎంతమంది రంగళ్లో, ఎంతమంది రంగళ్లో" అని వాళ్లవేపు పరుగెత్తాడుట.

మూాలయ్య

ఎంతపని చేశాడు!

పుట్టయ్య

బ్రాహ్మలందరూ ఎక్కడ మీాద పడతాడో అని నాలుగుదిక్కులా పరుగెత్తుకు వెళ్లి వాడిమీాదకు మరీ బెడ్డలు విసిరారుట.

మూాలయ్య

పాపం. తెలిసి చేస్తాడో తెలియక చేస్తాడో ఇలాంటిపనులు వాడు?

పుట్టయ్య

తెలిసి తెలిసి ఆలాగంటిపనుల చేసేవాడు కాడు మనపాణయ్య.

మూాలయ్య

వాడికి దెయ్యమే పట్టిందో భూతమే పట్టిందో మరి?

పుట్టయ్య

ఆ రాళ్లదెబ్బలచేతో మరి ఎంచేతో వాడు ఒళ్లు తెలియకుండా క్రింద పడిపోయాడుట. వాడ్ని తప్పించుకొని బ్రాహ్మలు రేవుకు వెళ్లి నీళ్లు ముంచుకు వెళ్లి పోయారుట.

మూాలయ్య

వాడి సంగతి ఏమైనట్టు?

పుట్టయ్య

కొంతసేపు అలాగ పడిఉండగా వర్షం పడింది. అతనికి తెలివి వచ్చింది. తెలివి వచ్చాక అతను నాలుగువైపులా చూచి, "అయ్యో! ఏరీ నా రంగళ్లు, ఏరీ నారంగళ్లు" అని తల బాదుకు ఏడ్చాడుట.

మూాలయ్య

అయ్యో సత్యకాలమా!

పుట్టయ్య

అలాగ ఏడ్చి ఏడ్చి తరవాత తనను కొట్టిన రాళ్లనన్నింటినీ ఎంతో భయభక్తులతో పోగు చేసి ముద్దుపెట్టుకొని, మళ్లీ ఆఇసుకలోనే కూర్చుని ఆ రాళ్లతో చుట్టూ ప్రాకారంలాగ కట్టి ఆ ప్రాకారంలో రంగనాధుడి దేవాలయం చిత్రించి, దాన్ని చూస్తూ, రంగా, రంగా అంటూ కళ్లు మూసుకొని ఒళ్లు మరిచి కూర్చుండిపోయాడు. ఎవ రెంత పిలిచినా పలకడు.

మూాలయ్య

వీ డిలాంటి పనులు చేస్తూఉంటే మనందరికీ ఏమి వస్తుందో అని నాకు భయంగా ఉంది.

పుట్టయ్య

మనమాట కేమి? వాడిమాట ఆలోచిస్తున్నాను, నేను! ఇది నిజంగా భక్తి అంటావా, పిచ్చి అంటావా?

మూాలయ్య

తన్ను కొట్టిన రాళ్లను భయభక్తులతో పోగు చెయ్యడం ఎందుకో?

పుట్టయ్య

ఎందుకా? "మా రంగళ్లు నాకిచ్చారీ రాళ్లు. మా రంగళ్లు నాకిచ్చారు. వీటితో నన్ను దేవాలయం కట్టుకోమన్నారు. నా రంగడికి వీటితో దేవాలయం కడతాను. మా రంగళ్లు ఎంత మంచివాళ్లు. మారంగళ్లకి నామీాద ఎంతదయ" అని వాడు అరుస్తూ కట్టాడుట ఆ ప్రాకారం!

మూాలయ్య

ఇది పిచ్చిలాగే ఉంది నామట్టుకు.

పుట్టయ్య

రంగనాధుడి దేవాలయం ప్రవేశించి సొంతంగా రంగనాధుణ్ణి తాను చూడగలుగుతే ఈ పిచ్చి పోతుందేమో అతనికి!

మూాలయ్య

ఎందువల్ల?

పుట్టయ్య

ఎరగవూ? చిన్నప్పటినుంచి ఏ మనీవాడో? "ఆ దేవాలయంలో రంగనాధుణ్ణి మనం ఎలాగ చూడ్డం? రంగనాధుడికి మనమీాద దయ లేదా? ఉంటే మన నెందుకు దూరంగా ఉంచుతున్నాడు? మనవి మాత్రం హృదయాలు కావా? మన హృదయాలుమాత్రం రంగనాధుణ్ణి చూడవలెనని తహతహ పడవా? రంగనాధుణ్ణి

చూడలేని జన్మ ఎందుకు? ఎప్పటికైనా ఈజన్మలో రంగనాథుణ్ణి నేను చూచి తీరుతాను"అని.

మూలయ్య

అదే వాడికి పిచ్చి!

పుట్టయ్య

ఈ పిచ్చికి మందేమిటో బ్రాహ్మలనే అడిగి తెలుసుకుందాము.

మూలయ్య

ఇది మన కులానికి అనర్థం కలగడానికే వచ్చింది. లేకపోతే మనకి రంగనాథు డేమిటి? బ్రాహ్మలు అంటే ఎవరు? వారు కొలిచే రంగధాముణ్ణి మనం కొలవడ మేమిటి? బ్రాహ్మలకి అపచారం చేస్తే ఎంత పాపం!

పుట్టయ్య

అవును మరి. పాణయ్యకి పుట్టుకతోనే పుట్టింది ఇలాంటి బుద్ధి. ఇది మంచికే వచ్చిందో చెడ్డకే వచ్చిందో.

మూలయ్య

అయినా దేవు డెక్కడ లేడు? ఆ దేవాలయంలో ఉండే రంగనాథుడే తనకు కావా లనడం ఎందుకంట?

పుట్టయ్య

ఏమి చెప్పను?

మూలయ్య

ఇదేదో అనర్థం కోసమే వచ్చింది.

పుట్టయ్య

ఉండరా ఉండరా. అదుగో చూడు. బ్రాహ్మలు ఎందుకో చెప్మా మన మాలపల్లెకు వస్తున్నారు?

మూలయ్య

నే చెప్పలేదూ? ఇదేదో మన కొంపమీదికి వచ్చేటట్లే ఉంది. ఇక్కడ ఉండకుండా మన్ని పొమ్మనే అంటారో, శిక్షించనే శిక్షిస్తారో!

పుట్టయ్య

బ్రాహ్మలు మాలపల్లెకు ఎందుకు రావాలో? మనపాపం పండింది. బ్రాహ్మలు మాలపల్లిలో కాలుపెడితే ఆపాపం ఎవరిదీ?

మూలయ్య

ఊరుకో, మాట్లాడకు. ఈమూల నిలబడదాము రా. వాళ్లకు అడ్డు నిలవరాదు.

పుట్టయ్య

అలాగే. ఏమి చేసే దిప్పుడు? చూడు చూడు. మనవాళ్లంతా గొల్లున గోల పెట్టుతున్నారు: "రావద్దు, రావద్దు. స్వాములారా! ఇది మాల పల్లి రావ"ద్దని. మనముకూడా రావద్దని కేకలు వేద్దామా?

మూలయ్య

వేద్దాము. లేకుంటే ఆపాపం మన్ని చుట్టుకుంటుంది.

పుట్టయ్య

బాబుల్లారా! ఇటు రాకండి, ఇవి మాలకొంపలు. బ్రాహ్మలు రాకూడనివి.

మూలయ్య

స్వాములారా! రాకండి రాకండి. చెప్పని పాపం మాది. చెపుతున్నాము. మీరు బ్రాహ్మలు. ఇవి మాలకొంపలు. రాకండి. ఇటు రాకండి

పుట్టయ్య

తెలియక వస్తున్నారేమో, మా దేవుళ్లు మీరు. రాకండి. ఇటు రాకండి. ఇవి మాలకొంపలు.

[ఇద్దరు బ్రాహ్మలు ప్రవేశము]

[దూరముగా ఉండి పుట్టయ్య, మూలయ్య సాష్టాంగపడతారు.]

మూలయ్య

బాబుల్లారా! క్షమించండి. తెలియక చేసిన తప్పులు. మా తప్పులు మీరు కాయకపోతే ఎవరు కాస్తారు?

పుట్టయ్య

మా పాణయ్యకు చిన్నప్పటినుంచీ పిచ్చే. ఆ పిచ్చిలో వాడు ఒళ్లు తెలియని పనులు చేస్తూ ఉంటాడు. తప్పులు క్షమించండి. ఇక ముందు వాడి విషయంలో జాగ్రత్తపడతాము.

దేశికాచారి

ఎక్కడరా పాణయ్య?

పుట్టయ్య

బాబూ, వాడు పిచ్చివాడు. ఈమాటికి వాడి తప్పు కాయండి. మమ్మల్ని రక్షించండి.

మూలయ్య

తమరు వర్తమానం చేస్తే మేము రామా? తాము మా పాడుపల్లికి రావాలా ప్రభువులు?

దేశికాచారి

ఏమిరా ఆ అసంబద్ధ ప్రలాపము? ఎక్కడరా పాణయ్య!

పుట్టయ్య

[మూలయ్య ముఖముకేసి చూచి మాట్లాడక ఊరుకొనును.]

మూలయ్య

[చేతులు జోడించుకొని] రక్షించండి నా తండ్రులు. వాడు పిచ్చివాడు. వాడిని బతకనివ్వండి. ఈపాలికి మా తప్పు కాయండి.

దేశికాచారి

మూర్ఖుడా! ఏమిరా ఆ ప్రలాపము. చెప్పరా! పాణయ్య ఎక్కడ ఉన్నాడు? రాజుగారి ఆజ్ఞ అయిందిరా!

మూలయ్య, పుట్టయ్య

అమ్మో! బాబో! మా కొంపలు మునిగేయి. రాజుగారి ఆజ్ఞే.

దేశికాచారి

అవునురా, ఇంకో గడియకు రాజుగారే వస్తారురా, పాణయ్యను చూడడానికి!

పుట్టయ్య

రాజుగారు రావడమే, రాజుగారు రావడమే!

మూలయ్య

రాజుగారు స్వయముగా శిక్షిస్తారు కాబోలు! రాజుగారు స్వయముగా శిక్షించేటంత తప్పు చేశాడు కాబోలు పాణయ్య!

దేశికాచారి

శిక్ష ఎందుకురా మూర్ఖుడా! రాజుగారు స్వయముగా వచ్చి పాణయ్యను రథంమీద ఊరేగిస్తూ తీసుకువెడతారు.

పుట్టయ్య

తెలియక అడుగుతున్నాను, క్షమించండి బ్రాహ్మణ దేవుళ్లు. మా పాణయ్యను శిక్షించ డానికి కాదూ వస్తూఉంట రాజుగారు?

దేశికాచారి

కాదురా, పాణయ్యను రంగనాథుడి దగ్గిరికి స్వయముగా తీసుకువెళ్లడానికి వస్తున్నారు.

మూలయ్య

స్వాములు మనతో వేళాకోళ మాడుచున్నారు. రక్షించండి, మీరే మా దేవుళ్లు. మీరు తలుచు కొంటే చెయ్యలేని దేమిటి?

దేశికాచారి

మీరు శుద్ధమూర్ఖులు. చెప్పితే తెలియదా? పాణయ్యమీద రాజుగారికి దయ గలిగింది. ఇక మాట్లాడక ఇక్కడకు అతన్ని తీసుకరండి. లేదా, రాజుగారు వస్తున్నారని చెప్పి వాడిని సిద్ధంగా ఉండమని చెప్పండి. ఇక మాట్లాడక వెళ్లండి.

[మూలయ్య, పుట్టయ్య వెళ్లిపోతారు.]

వేదాంతం

ఈమాలపల్లెలో కాలు పెడితే నాకు ఒళ్లు గరి పొడుస్తోంది.

దేశికాచారి

ఎందు వల్లనో?

వేదాంతం

నాజన్మలో ఇటువంటి అకార్యకరణము చేస్తా నని ఎప్పుడూ అనుకో లేదు. అందువల్ల ఈ గగుర్పాటు.

దేశికాచారి

శ్రీరంగనాథ కటాక్షముచేత పావనమైనది కాదా ఈ మాలపల్లి. ఇంక దీనికి రంగక్షేత్ర మహిమ కలిగిం దన్నమాట.

వేదాంతం

అవును. కాని ఆమాట మనస్సు వినడం లేదు.

దేశికాచారి

ఆచారము ఒక్కొక్కప్పుడు ధర్మాన్ని నాశ ము చేస్తుంది. ధర్మమని తెలిసిఉండీన్నీ ఆచారా నికి దాసుల మౌతున్నాము మనము.

వేదాంతం

అవును. తెలియని విషయంకాదు. ఆమాటకి వస్తే భగవంతుడు లేని తావేదీ? రంగధాముని కటాక్షమున మెలగనివా రేరీ? రంగధాముడికి జాతిమతాలు కావాలా, భక్తి కావాలా? ఇవన్నీ తెలిసిఉండినా ఆచారానికి భిన్నంగా ప్రవర్తిం చడమంటే మనస్సు ఒప్పుకోదు.

దేశికాచారి

అది మానవస్వభావమేమో? లేక పూర్వా ర్జిత కర్మఫలమో!

వేదాంతం

ఈకలికాలంలో ఇటువంటి వింతలు పుట్టడం మాట చెప్పు.

దేశికాచారి

రంగనాథుడు కావేరీ తీరవాసి, ప్రత్యక్షదైవం. ఇంకా సందేహ ముందా?

వేదాంతం

పాణయ్యను కొట్టినదెబ్బలు రంగనాథుడి ఒంటి మీద కనిపించడం మాట చెప్పు!

దేశికాచారి

పాణయ్య ఎవడో మాలవా డనుకొన్నాము కాని ఇటువంటి భక్తాగ్రేసరుడని ఎవరూ అనుకో లేదు.

వేదాంతం

రంగనాథుడి కటాక్షంవల్ల ఒక భక్తాగ్రేసరుడు మనకు తెలిశాడు.

దేశికాచారి

అంతే కాదు; భక్తుడూ భగవంతుడూ ఒక్కటే అని కూడ నిరూపించాడు శ్రీరంగధాముడు.

వేదాంతం

ఎంతమహత్తు ఎంతమహత్తు మన శ్రీరంగనాయకుల వారిది!

దేశికాచారి

మానవులు ఆదేశప్రియులూ, ఆచరణరహితులూ కావడంవల్ల రంగనాథుడే రాజు గారికి కలలో స్వయముగా ప్రత్యక్ష మయ్యాడుట.

వేదాంతం

కాకపోతే పాణయ్య రాళ్లదెబ్బలకి ప్రాణాలు విడిచిపెట్టవలసినవాడే.

దేశికాచారి

అగ్రజాతుల భక్తిలేశము అతిమాత్రముగా మనము వర్ణిస్తాము. అంత్యజుల అవిరళభక్తిని తృణీకరిస్తాము. ఈలోపము సవరించడానికే రంగధాముడు రాజుగారి కలలో కనిపించి ఉంటాడు.

వేదాంతం

తనతోపాటు తనభక్తుణ్ణికూడా ప్రజలు పూజించవలెనని అట్లా చేసిఉంటాడు రంగనాథుడు.

దేశికాచారి

పరిమిత జ్ఞానముతో సర్వజ్ఞునిఊహలు గ్రహించడానికి ప్రయత్నిస్తున్నాము మనము.

వేదాంతం

జన్మదోషమో, వర్ణదోషమో కాని, భగవంతుణ్ణి మనమే గుత్తగొంటున్నాము. మనము కట్టకొన్న ప్రాకారాల మధ్యనే భగవంతుణ్ణి బంధించకోరే మన ఊహలు తప్పని ఇప్పుడు బోధపడింది.

దేశికాచారి

భగవంతుడి కౌగిలి మానవుల కందరకూ క్రీడారంగమన్నమాట ఇప్పుడు తెలిసింది.

వేదాంతం

కాని ఒకమాట చెప్పతాను, విను. పాణయ్యను మన మిప్పుడు మనకూటములో చేర్చుకొంటాము కాని పాణయ్యవంటివా డింకొక్కడు మళ్లీ పుట్టితే వాడిని రాళ్లతో రువ్వుతాము; తప్పదు.

దేశికాచారి

మళ్లీ రంగనాథుడు తనమహత్తు చూపించాలి. అందాకా ఒప్పుకోము. ఆమాట నిజమే.

వేదాంతం

దినమూ రంగనాథుణ్ణి పూజించే పూజారికంటె దూరాన్నుంచి రంగధాముని ఆలయ గోపురము చూచే మాలవాడికే భక్తి ఎక్కువ పుట్టుతుంది కాబోలు!

దేశికాచారి

రంగనాయకుల దయవల్ల భక్తే అగ్రవర్ణలక్షణమని బోధపడింది. ఈతరమువారి కుబుద్ధు లింతటితో అంత మొందినట్లే!

వేదాంతం

తరువాతి తరములవారు దీని నీతిని స్మరించుకొని ఆచారమునకు దాసు లౌతారు సుమా!

దేశికాచారి

రాజుగారు వస్తూ ఉన్నట్లు తూర్యధ్వనులు వినిపిస్తున్నవి.

వేదాంతం

ఇంకా పాణయ్యను వాళ్లు తేలేదు. ఏమి చేస్తున్నారో ఈమాలవాళ్లు ఇంత సేపటినుంచీ!

దేశికాచారి

ఈనాడు పాణయ్య హృదయపుష్పాన్ని రంగనాథుడి పాదపద్మాలమీాద అర్పిస్తాడు.

వేదాంతం

ఇదివరకే చేశా డాపని. పాణయ్యకులమువారికీనాడు రంగధాముడి దర్శన భాగ్యము లభిస్తుంది. రంగధాముడి కటాక్ష వీక్షణములలో స్నానము చేస్తారు వారు.

దేశికాచారి

వైష్ణవాగ్రగణ్యు లవుతా రీరోజున వారు. అరుగో అరుగో, పాణయ్యను వాళ్లు లాగుకు వస్తున్నారు.

వేదాంతం

ఆగోచీగుడ్డతో వాడిని రాజుగారి యెదుట ఎలాగ పెట్టడం?

దేశికాచారి

ఆభక్తశిఖామణికి ముస్తాబు ఎందుకు?

వేదాంతం

భక్త్యావేశమే అతని ముస్తాబు.

[మూాలయ్య, పుట్టయ్య, పాణయ్య ప్రవేశం.]

పాణయ్య

వదలండి నన్ను వదలండి. నారంగడిదగ్గిరికి నే వెళ్లిపోతాను నన్ను వదలండి నన్ను వదలండి. ఏడీ నారంగడు? ఏడీ, ఏడీ, ఏడీ? కావేరీనది గట్టున కూర్చున్నాడు నారంగడు. నన్ను రమ్మంటున్నాడు. నే వెళ్లిపోతా. నారంగడి దగ్గరికి నే వెళ్లిపోతా.

పుట్టయ్య

ఉండరా పాణయ్యా, ఎందుకు పెనుగులాడతావు? నీకోసం బ్రాహ్మణయ్యలు వచ్చారు చూడరా.

పాణయ్య

వచ్చారా నారంగళ్లు వచ్చారా! నాకోసం వచ్చారా నారంగళ్లు; నారంగళ్లకి నన్ను చూస్తే ఎంతదయ; నారంగళ్లు నన్ను దేవాలయం కట్టుకోమని నాకు రాళ్లు ఇచ్చారు కాదూ? నారంగళ్లకు మొక్కుకొంటాను.

ఏరీ నారంగళ్లు?

[అంటూ వైష్ణవుల పాదాలమీద పడును.]

వేదాంతం

ముట్టకు ముట్టకు. [అని దేశికుణ్ని చూచి నాలుకకరచుకొని]

లే, పాణయ్యా, లే; నీకోసం రాజుగారు వస్తున్నారు.

దేశికాచారి

నిన్ను రంగనాయకులదగ్గిరికి రాజుగారు స్వయముగా తీసుకువెళ్లుతారట; అరుగో, రాజుగారు వస్తున్నారు.

పాణయ్య

[సంతోషంతో గంతులువేస్తూ]

నన్ను రంగనాథుడిదగ్గిరికి తీసుకువెళ్లుతారా! రాజుగారు వస్తున్నారా! నా రంగనాయకుణ్ని దేవాలయంలో నేను చూచుకోవచ్చునా, నేను కొలుచుకోవచ్చునా,—నారంగనాయకుణ్ని?

దేశికాచారి

ఆ! సందేహం లేదు!

వేదాంతం

నిన్నుచూస్తే రంగనాయకుడికి చాలా ప్రీతి.

పాణయ్య

రాజుగారు ఎందుకు పిలవడం నన్ను? నాకిక్కడ నారంగనాథుడు లేడూ? నా కీరంగడు చాలడూ? నారంగడు కావేరీతీరాన్ని ఇసుకతిన్నెలమీద ఆడుకొంటున్నాడు. నేను నా రంగడిదగ్గిరికి వెళ్లిపోతాను. నారంగణ్ని నేను కొలుచుకొంటాను.

దేశికాచారి

నీవు వెళ్లిపోకు. రాజుగారికి కోపం వస్తుంది.

వేదాంతం

నీవు వెళ్లితే నిన్ను శిక్షిస్తారు సుమా.

పాణయ్య

నాకొద్దు దేవాలయంలో రంగన్న! ఆ రంగడు బ్రాహ్మలరంగడు. నే నాఆలయంలోకి వెడితే బ్రాహ్మలకి కోపం రాదూ! బ్రాహ్మలకికోపం వస్తే నాకు పాపం రాదూ! బ్రాహ్మలకి కోపం వస్తే నారంగడికి నామీద కోపం రాదూ! నాకీ రంగడే చాలు. నారంగన్నతోనే నే నాడుకొంటాను. నారంగన్న నే కొలుచుకొంటాను.

దేశికాచారి

నీవు దేవాలయంలోకి వస్తే బ్రాహ్మలకి కోపం రాదు. వెయ్యిమంది బ్రాహ్మలు రాజుగారి వెంట వస్తున్నారు నిన్ను తీసుకువెళ్లడానికి!

వేదాంతం

రంగడునిన్ను తీసుకురమ్మనివారితో చెప్పాడుట.

పాణయ్య

బ్రాహ్మలే వస్తున్నారా నాకోసం? అమ్మో, బ్రాహ్మణదేవుళ్లు మా ఇంటికి రావచ్చా? రంగడు నన్ను తీసుకురమ్మన్నాడా? నిజంగా, నిజంగా? నారంగడే నన్ను తీసుకురమ్మంట? నారంగడే?

దేశికాచారి

రంగడిఒంటికి నిన్ను కొట్టిన దెబ్బలు తగిలాయిట!

పాణయ్య

ఎవరి ఒంటికీ?

వేదాంతం

శ్రీరంగనాయకులవారి ఒంటికి.

పాణయ్య

ఎందుకు తగిలాయి?

దేశికాచారి

మేము నిన్ను రాళ్లతో కొట్టాము కామూ? ఆదెబ్బలు రంగడికి తగిలాయిట.

పాణయ్య

అమ్మో, అమ్మో, మా రంగడికే దెబ్బలు! నా కెందుకు తగిలేయికావు ఆ దెబ్బలు? నా ఈ పాడుదేహానికి తగి_ల్తే అది భగవదారాధనకు స్వాధీనమయ్యేదే! నా రంగడికి దెబ్బలు తగిలాయా? అయ్యో, అయ్యో! [ఏడ్చును.]

దేశికాచారి

రంగడు రాజుగారికి కలలో కనిపించి నిన్ను దేవాలయంలోకి తీసుకు రమ్మన్నాడుట!

పాణయ్య

నిజంగా, నిజంగా?

దేశికాచారి

నిజమే.

పాణయ్య

మారంగయ్య నన్ను తీసుకురమ్మంట నిజమే?

వేదాంతం

నిజమే.

పాణయ్య

మారంగడు నన్ను దర్శనం చేసుకోమన్నాడా? నిజంగానే?

పుట్టయ్య

నిజంగానే.

పాణయ్య

శ్రీరంగనాయకులవారికి ఎంతటి ఆశ్రిత పక్షపాతం! నన్ను రమ్మన్నారా? నన్ను రమ్మన్నారా? నన్ను రమ్మన్నారా? నిజంగానే?

మూలయ్య

నిజమేనటయ్యా!

పాణయ్య

నారంగయ్య నన్ను దేవాలయంలోకి రమ్మన్నాడు. నిజమే. నిజమే. ఇన్నాళ్లకి నా దేవుడిదర్శనం నా కవుతుంది. ఇన్నాళ్లకి నేను కరువుతీరా నా రంగణ్ణి చూచుకొంటాను. రంగణ్ణి చూడని ఈ కళ్లెందుకు నాకు? రంగణ్ణి మొక్కని ఈచేతు లెందుకు నాకు? రంగణ్ణి పలకని ఈ నాలుక ఎందుకు నాకు? రంగణ్ణి తలవని ఈ హృదయ మెందుకు నాకు? నారంగణ్ణి నేను మనసారా కొలుచుకొంటాను. నా రంగడు నన్ను రమ్మన్నాడు. బ్రాహ్మలు రంగణ్ణి చూడమన్నారు నన్ను. రాజుగారు రంగణ్ణి చూడమన్నారు నన్ను. నా రంగడే నన్ను రమ్మంటున్నాడు. నేను వెడుతున్నా! నేను వెడుతున్నా! నారంగడికోసం వెడుతున్నా! నా రంగడిని చూచుకొంటాను. నారంగడిని కాగలించుకొంటాను. నారంగణ్ణిపూజించుకొంటాను. వెడుతున్నా నారంగడిదగ్గిరికి. రంగా, రంగా, నాతండ్రీ, ఓరంగా! వస్తున్నా తండ్రీ, నీఒళ్లోకి. వస్తున్నా నాయనా, నిన్ను మొక్కుకోడానికి! వస్తున్నాప్రభూ, నీ పాదాలదగ్గిరికి! వస్తున్నా రంగా, వస్తున్నా, రంగా, రంగా.

[అని వెళ్లిపోవును.]

దేశికాచారి

రాజుగారు వాద్యములతో వస్తున్నారు. ఆగు పాణయ్యా ఆగు.

వేదాంతం

వెయ్యిమంది బ్రాహ్మలతోకూడా వస్తున్నారు.

పుట్టయ్య

ఆపేదా, బాబూ వాణ్ణి?

మూలయ్య

పరుగెత్తుకువెళ్లి పట్టుకోమన్నారా?

దేశికాచారి

పట్టుకోండి పట్టుకోండి.

పుట్టయ్య, మూలయ్య

ఆగరా పాణయ్యా, ఆగరా, ఆగరా.

[అని పరిగెత్తి పోతారు.]

వేదాంతం

మరి వాణ్ణి వీళ్లు పట్టుకోలేరు? మనం ఇక్కడ ఉందామా? వెడదామా?

దేశికాచారి

రాజుగారు వస్తారుగా! వారికీ వర్తమానం చెప్పవద్దూ? ఆగుదాము లే.

వేదాంతం

చూడు చూడు. వాడు మాలపల్లిలో జనాన్ని అందరినీ తీసుకుపోతున్నాడు రంగనాయకుల గుళ్లోకి! గంతులువేస్తున్నాడు! పాటలు పాడుతున్నాడు! మాలవాళ్లందరూ అతనితో కలిసి పాడుతున్నారు!

దేశికాచారి

వెయ్యిమంది బ్రాహ్మలూ వాణ్ణి చుట్టవేసి పట్టుకొన్నారు చూడు చూడు. ఔరా, ఆశ్చర్యం! వాడిపాదాలకు మొక్కుతున్నారు, వారంతా!

వేదాంతం

మన మెంత తప్పు చేశాము! వాడి పాదాలకి మొక్కవలెననే తోచింది కాదు మనకు!

దేశికాచారి

అది మన దౌర్భాగ్యం. పూర్వకృత కర్మదాటడం ఎవరి శక్యం.

చూడు చూడు. వాడిని రాజుగారి రథంలో రాజుగారిపక్క కూచోబెట్టారు. రాజుగారు అతన్ని కౌగలించుకొంటున్నారు.

వేదాంతం

పాణయ్య రథంలో మూర్ఛపోయాడు, చూడు.

దేశికాచారి

ఓహో, ఎంతటి దివ్యదృశ్యము! ఎంతటి పుణ్యదినము! అనంతకాలములో ఈ ఒక్కదినమూ ఎంతటి పుణ్యదినము! మాలలూ బ్రాహ్మలూ కలిసిమెలిసి రథంవెనక శ్రీరంగనాయకుల దేవాలయానికి వెళ్లుతున్నారు చూడు.

వేదాంతం

మాలలు పాటలు పాడుతున్నారు. బ్రాహ్మలు స్వస్తి వాచకములు చెప్పుతున్నారు. రంగడి పేరు మిన్ను ముట్టుతోంది.

దేశికాచారి

వెడదాము పద. మనం మాత్రం ఇక్కడ ఒక్కళ్లమూ ఉండడ మెందుకు. రంగడి ఉత్సవములో మనమూ కలుద్దాము.

వేదాంతం

పద. చప్పున పద.